సాక్షి కరీంనగర్

మంగళవారం । 15 । ఆగస్టు । 2023

I

పంద్రాగస్టుకు ముస్తాబు

కరీంనగర్ అర్బన్: స్వాతంత్య్ర వేడులకు కరీంనగర్‌లోని పోలీస్ మైదానం ముస్తాబైంది. మంగళవారం ఉదయం 11 గంటలకు మంత్రి గంగుల కమలాకర్ పతాకావిష్కరణ చేయనున్నారు. 11.02 నిమిషాలకు వందన స్వీకారం, 11.10 నిమిషాలకు మంత్రి సందేశం, 11.25 నిమిషాలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 12.15 గంటలకు వివిధ రంగాల్లో కృషిచేసిన వారికి ప్రశంసపత్రాలు అందించనున్నారు. మధ్యాహ్నం 12.35 గంటల నుంచి వివిధ శాఖల స్టాల్స్ పరిశీలనతో కార్యక్రమం ముగియనుంది.



న్యూస్‌రీల్

'వీకెండ్ మస్తీ' విజయవంతం చేయాలి

- మంత్రి గంగుల కమలాకర్



బ్రిడ్జిపై ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి తదితరులు

కరీంనగర్‌కల్చరల్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం సాయంత్రం కేబుల్ బ్రిడ్జిపై ప్రారంభించనున్న వీకెండ్ మస్తీ సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో మేయర్, అదనపు కలెక్టర్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, ఇతర అధికారులతో వీకెండ్ మస్తీ కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్షించారు. కేబుల్ బ్రిడ్జిపై ప్రతీ శని, ఆదివారాల్లో నిర్వహించనున్న వీకెండ్ మస్తీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించనున్న తరుణంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, స్టాళ్ల ఏర్పాటు చేసిన చోట, ఇతర ప్రాంతాల్లో చెత్త బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. ఫుడ్ స్టాళ్ల నాణ్యమైన ఆహారాన్ని అందించేలా చూడాలని, స్టాళ్ల ఏర్పాటుకు ఎటువంటి ఫీజు వసూలు చేయరాదని అధికారులను ఆదేశించారు. అనంతరం కేబుల్ బ్రిడ్జిపై వీకెండ్ మస్తీ ఏర్పాట్లను పరిశీలించారు. మంత్రి వెంట మేయర్ వై.సునీల్‌రావు, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, కరీంనగర్ ఆర్డీవో మహేశ్, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, ఇరిగేషన్ ఈఈ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వజ్రోత్సవాల్లో భాగస్వాములు కావాలి

- మేయర్ సునీల్‌రావు



జాతీయ జెండాల పంపిణీ కార్యక్రమంలో మేయర్ సునీల్ రావు తదితరులు

కరీంనగర్ కార్పొరేషన్: స్వాతంత్య్ర దినోత్సవ వేళ ఇంటింటా జాతీయ జెండా ఎగురవేయాలని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు పిలుపునిచ్చారు. స్వాతంత్య్ర వజ్రోత్సవాల్లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. సోమవారం నగరంలోని 33వ డివిజన్ భగత్‌నగర్‌లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. భగత్‌నగర్‌లో ఇంటింటికీ జాతీయ జెండాలు పంపిణీ చేశారు. స్వాతంత్య్రం సాధించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంలో ఘనంగా ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నగరవ్యాప్తంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా నగరపాలకసంస్థ ప్రత్యేక చర్యలు చేపట్టిందని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గంట కళ్యాణి, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, కోల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వృక్ష విలాపం!

- ఎన్‌హెచ్ 563 విస్తరణకు మొదలైన నరికివేత
- దాదాపు రెండువేల వృక్షాల ఆయువు ఖతం
- పర్యావరణానికి తీరని చేటని శాస్త్రవేత్తల ఆందోళన
- తిరిగి అదే సంఖ్యలో నాటుతామంటున్న అధికారులు



నేలకొరిగిన దశాబ్దాల వయసుగల చెట్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా వందలాది వృక్షాలు నేలకొరుగుతున్నాయి. నిన్న మొన్నటి దాకా ఎంతో మందికి నీడనిచ్చి, ప్రాణవాయువును పంచి, ఎండా, వానలో నీడనిచ్చి, పశుపక్ష్యాదులకు కడుపు నింపి, గూడులా నిలిచిన చెట్లు అవి. జాతీయ రహదారి ఎన్‌హెచ్– 563 పనుల్లో భాగంగా వరంగల్– కరీంనగర్ సెక్షన్‌లో భారీ చెట్ల తొలగింపు మొదలైంది. ఇప్పటికే దాదాపుగా దశాబ్దాల నాడు నాటిన పురాతన వృక్షాలను కూకటివేళ్లతో సహా తొలగిస్తున్నారు. కరెంటు రంపాలతో వందేళ్లనాటి చెట్లు సైతం క్షణాల్లో నేలకూలుతున్నా యి. రోడ్డు విస్తరణ కోసం రోడ్లను తొలగించాల్సిన అనివార్య పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ తొలగింపు కాంట్రాక్టు తీసుకున్న ఓ సంస్థ నరికివేత కార్యక్రమం వేగిరం పెంచింది. దీంతో వరంగల్– కరీంనగర్ రహదారిపై ఎక్కడ చూసినా విరిగిన కొమ్మలు, నేలకూలిన వృక్షాలు, రంపపు పొట్టు, నరికిన మొద్దులు, కర్రదుంగలతో యుద్ధక్షేత్రాన్ని తలపిస్తోంది. దాదాపు ఈ సెక్షన్‌లో 2,000 లకుపైగా దశాబ్దాలనాటి చెట్లు కూల్చక తప్పని పరిస్థితులు ఏర్పడటంతో పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్‌హెచ్ 563 కోసం తాము కూలుస్తున్న ఈ చెట్ల స్థానంలో తిరిగి మొక్కలు నాటుతామని, పూర్వం స్థాయిలో పచ్చదనాన్ని పునరుద్ధరిస్తామని జాతీయ రహదారి విభాగం అధికారులు స్పష్టం చేస్తున్నారు.

కొత్తగట్టు దగ్గర టోల్‌గేట్లు..

కరీంనగర్ శివారులోని మానకొండూరు మండల కేంద్రం నుంచి హనుమకొండ శివారులో ఉన్న పలవేల్పుల వరకు 68 కి.మీ. నాలుగు వరుసల రహదారి నిర్వహణ బాధ్యతలను భోపాల్‌కు చెందిన దిలీప్ బిల్డ్‌కాన్ లిమిటెడ్ సంస్థకు అప్పగించారు. భూసేకరణ ప్రక్రియ దాదాపుగా పూర్తయినట్లే. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) పనులు ప్రారంభమయ్యాయి. 20 జూలై 2025లోపు పనులు పూర్తి చేసేందుకు లక్ష్య సాధనగా నిర్ణయించారు. అప్పటి నుంచి 15 ఏళ్ల వరకు నిర్వహణ బాధ్యతలు సంస్థ చూసుకుంటుంది. ఈ లెక్కన 2040 వరకు టోల్ చార్జీలు వసూలు చేసుకునే వెసులుబాటు సదరు కాంట్రాక్టు సంస్థకు దక్కనుంది. ఇప్పటి వరకూ ఈ మార్గంలో ఎలాంటి టోల్‌గేట్ లేదు. దీంతో మరో రెండేళ్లలో మానకొండూరు– పలవేల్పుల మధ్యలో కీలకమైన, వ్యూహాత్మక పాయింట్ చూసి టోల్‌గేట్ కూడా నిర్మిస్తారు. టోల్ వసూలు 2025 నుంచే ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నట్లు జాతీయ రహదారి హైవే అధికారులు వెల్లడిస్తున్నారు. కరీంనగర్–జగిత్యాల హైవే రహదారి నిర్మాణం కోసం కూడా భూసేకరణ ప్రక్రియ, యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు అధికారులు ఆ దిశగానే ప్రయత్నాలు ముమ్మరం చేశారు.



కొత్తగట్టు సమీపంలో టోల్‌గేట్ నిర్మాణానికి ఏర్పాట్లు

రూ.156 కోట్లు పెరిగిన ఎస్టిమేషన్లు..

ప్రస్తుతం ఎన్‌హెచ్ 563 జగిత్యాల– కరీంనగర్ సెక్షన్‌లో కరీంనగర్ బస్టాండు నుంచి కోర్టు చౌరస్తా, రేకుర్తి, కొత్తపల్లి మీదుగా వెళ్లే దారిలో ఇప్పటికే పలుచోట్ల మార్పులు జరిగాయి. కరీంనగర్‌లో మానకొండూరు మీదుగా ఇరుకుల్ల వాగు జూబ్లీనగర్, ఎలబోతారం, రుక్మాపూర్ మీదుగా కొత్తపల్లిలో కలవనుంది. ఈ రహదారి వెంట 11 బ్రిడ్జీలు రూపుదిద్దుకోనున్నాయి. మొత్తం 68 కి.మీ పొడవున్న ఈ రహదారి నిర్మాణానికి గతేడాది దాదాపు రూ.1,491 కోట్లతో అంచనాలు రూపొందాయి. ఈ అంచనా వ్యయం తాజాగా రూ.2,146 కోట్లకు చేరుకుందని ప్రచారం జరిగినా, తాజాగా రూ.1,647 కోట్లకు పరిమితమైందని తెలిసింది. అంటే దాదాపుగా రూ.156 కోట్లు అంచనా వ్యయం పెరిగింది. దీనికి భూసేకరణ కారణాలా? పెరిగిన నిర్మాణ వ్యయమా.. ఇతర సాంకేతిక కారణాలా? అన్న కారణాలు తెలియవు. మొత్తంగా ఖమ్మం నుంచి వరంగల్ మీదుగా జగిత్యాల వరకు నిర్మించతలపెట్టిన జాతీయ రహదారి–563 నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్దేశించిన గడువులో పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

కాపాడుకోవాలి..



జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కరీంనగర్–వరంగల్ మార్గంలో వేలాది వృక్షాలను నేలమట్టం చేయబోతున్నారు. గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పుల వంటి విపత్తులను ఎదుర్కోవడానికి చెట్లు చేసే సహాయం అంతా ఇంతా కాదు. ఈ రహదారులకు ఇరువైపులా ఉన్న వృక్షాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆధునిక ట్రీ ట్రాన్స్ ప్లాంటేషన్ పద్ధతులు అవలంబించి ఈ చెట్లను కొంచెం దూరం జరిపి తిరిగి నాటడం లేదా వేరే ప్రాంతానికి ట్రాన్స్ లోకేషన్ ప్రక్రియ ద్వారా తీసుకెళ్లి అక్కడ నాటడం వల్ల వాటిని తిరిగి పునర్జీవింప చేయవచ్చు. ఈ ప్రక్రియ కోసం వృక్షశాస్త్ర నిపుణులు, శాస్త్రవేత్తలు అందరూ తమ సంసిద్ధతను వ్యక్తపరుస్తున్నారు.

– డాక్టర్ నరసింహమూర్తి

ఎంత పనిచేశావ్ నాన్న



రోదిస్తున్న కళ్యాణి

- నాకు దిక్కెవరు అమ్మా..!
- కుటుంబ కలహాలకు తల్లిదండ్రులు బలి
- గుండెలవిసేలా రోదించిన ఒక్కగానొక్క కూతురు

కరీంనగర్‌క్రైం: 'ఎంత పని చేశావ్ నాన్న.. నాకు ఇక దిక్కెవరు అమ్మా.. నన్ను ఒంటరిని చేసి వెళ్లిపోయారా..' అంటూ ఆ కూతురు గుండెలవిసేలా రోదించిన తీరు కంటతడి పెట్టించింది. కుటుంబ కలహాలు తల్లిదండ్రులను బలిగొనగా, వారి కూతురు అనాథగా మారింది. కరీంనగర్ టూటౌన్ పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మార్కండేయనగర్‌కాలనీకి చెందిన వేముల ప్రవీణ్(50), లావణ్య(42)కు 18 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కూతురు కళ్యాణి సంతానం. ప్రవీణ్ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తుండగా, లావణ్య టైలరింగ్ పనిచేసేది. వీరి కూతురు కరీంనగర్‌లోని ఓ పాఠశాలలో హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి చదువుతోంది. ఇంట్లో దంపతులు ఇద్దరే ఉండేవారు. ఇంటి పై అంతస్తులో ప్రవీణ్ తల్లిదండ్రులు ఉంటున్నారు. కొన్నేళ్ల నుంచి ప్రవీణ్ దంపతులకు గొడవలు జరుగగా పెద్దలు సర్దిచెప్పారు. శనివారం మరోసారి గొడవ తీవ్రరూపం దాల్చి ఆవేశానికి లోనైన ప్రవీణ్ భార్య తలపై సిమెంట్ ఇటుకతో బలంగా కొట్టడంతో మృతిచెందింది. ఈ క్రమంలో ఆదివారం వేకువజామున అతడు హాస్టల్‌కు వెళ్లి తన కూతురును చూసి వచ్చినట్లు తెలిసింది. అనంతరం సూసైడ్ నోట్ రాసి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్నేహితులు ప్రవీణ్‌కు పలుమార్లు ఫోన్ చేయగా, లిఫ్ట్ చేయకపోవడంతో వారు వచ్చి చూసేసరికి భార్యాభర్తలు చనిపోయి ఉన్నారు. టూటౌన్ సీఐ రాంచందర్‌రావు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.



కుటుంబ సభ్యులతో ప్రవీణ్–లావణ్య (ఫైల్)

మెడికల్ కాలేజీకి ఇవ్వండి

'మా శవాలను మెడికల్ కాలేజీకి ఇవ్వండి. ఎలాంటి దహన సంస్కారాలు చేయాల్సిన అవసరం లేదు. ఎవరూ ఇబ్బంది పడొద్దు. మనిషి పుట్టుక ఎంత సహజమో మరణం కూడా అంతే సహజం. కానీ విధిని బట్టి వేర్వేరు విధాలుగా వస్తుంది. దయచేసి అర్థం చేసుకోండి. స్వార్థం కోసం ఎదుటివారి మనోభావాలను దెబ్బతీయకండి. జరిగిన ఘటనకు ఎవరినీ తప్పుపట్టాల్సిన అవసరం లేదు' అని ప్రవీణ్ తన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు.

మరణవార్త తెలియగానే..

తల్లిదండ్రుల మరణ వార్త తెలియగానే కళ్యాణి హాస్టల్ నుంచి వచ్చి కన్నీరుమున్నీరుగా విలపించింది. ఆమెను ఓదార్చడం ఎవరితరం కాలేదు. కళ్యాణిని చూసి స్థానికులు, బంధువులు ఘొల్లుమన్నారు. వందల సంఖ్యలో స్థానికులు వారి ఇంటి వద్ద గుమికూడారు.

కలిసి తిరిగిండు.. కత్తితో పొడిచిండు..

- రేకుర్తిలో వ్యక్తి దారుణ హత్య
- పోలీసులకు లొంగిపోయిన నిందితుడు

కొత్తపల్లి(కరీంనగర్): వారిద్దరూ స్నేహితులు.. నిత్యం కలిసే తిరిగేవారు.. ఉన్నట్టుండీ ఏమైందో గానీ.. వీరిలో ఒకరు తన మిత్రుడిని కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశాడు. కొత్తపల్లి ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ శివారు రేకుర్తి విజయపురికాలనీకి చెందిన మావురం నాగరాజు(38) ఓ సినిమా హాల్‌లో, అతని భార్య చంద్రకళ శాతవాహన యూనివర్సిటీలో స్వీపర్‌గా పని చేస్తున్నారు. నాగరాజు, ఇదే ప్రాంతానికి చెందిన మేక అజయ్ మంచి స్నేహితులు. నిత్యం కలిసే తిరుగుతూ మద్యం తాగేవారు. సోమవారం ఉదయం 11 గంటలకు స్థానికుడైన మారంపల్లి వినోద్ నాగరాజు ఇంటికి వచ్చాడు. స్థానిక బెల్టు షాపులో మద్యం కొనుగోలు చేసి, అతన్ని అజయ్ ఇంటికి తీసుకెళ్లాడు. తర్వాత నాగరాజు, అజయ్‌ల మధ్య ఏం జరిగిందో తెలియదు గానీ.. అజయ్ కత్తితో నాగరాజు గొంతులో పొడిచాడు. స్థానికులు గమనించి, బాధితుడిని కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. తన భర్తను హత్య చేయాలన్న ఉద్దేశంతోనే గొంతులో కత్తితో పొడిచాడని, ఇందుకు మేక రాజశేఖర్, కిరణ్, లక్ష్మి, మారంపెల్లి వినోద్‌లు సహకరించారని మృతుడి భార్య చంద్రకళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా నిందితుడు అజయ్ పోలీసులకు లొంగిపోయినట్లు తెలిసింది. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలున్నారు.



నాగరాజు (ఫైల్)

ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసపత్రాలు

సాక్షి స్పందన

కరీంనగర్ అర్బన్: ఎట్టకేలకు ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందనున్నాయి. ఈ నెల 9న 'సాక్షి' మినీలో 'ప్రశంసా ఉన్నట్టా.. లేనట్టా' శీర్షికన కథనం వెలువడిన విషయం విదితమే. ఈ క్రమంలో కలెక్టర్ డా.బి.గోపి స్పందించి ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు. గత ఆగస్టు 15 నుంచి రెండుసార్లు ప్రశంస పత్రాలు లేకపోగా మరి ఈ సారి కూడా ఉంటవా.. ఉండవానన్న అంశాలను 'సాక్షి' ప్రస్తాంచింది. ఈ నేపథ్యంలో ఆయా శాఖల ఉత్తమ ఉద్యోగుల జాబితా పంపాలని ఆదేశించగా సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌కు చేరాయి. అటెండర్ నుంచి ఆయా విభాగాల గెజిటెడ్ అధికారుల వరకు విభాగాల వారీగా జాబితా అందించగా 200లకు పైగా పేర్లను పంపినట్లు సమాచారం. వివిధ విభాగాల అధికారులకు ప్రశంసాపత్రం ఇవ్వడంలో కలెక్టర్ నిర్ణయం తీసుకోనున్నారు. మంగళవారం పోలీస్ పరేడ్ మైదానంలో మంత్రి కమలాకర్ చేతుల మీదుగా ఉత్త మ ఉద్యోగులు ప్రశంసా పత్రాలను స్వీకరించనున్నారు.

ప్రజావాణి.. వినతుల బాణి

- అత్యధికం భూ సమస్యలే
- రేషన్ కార్డులు, డబుల్ బెడ్ రూం ఇళ్లు
- అవే సమస్యలు, అర్జీలు

కరీంనగర్ అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తోన్న ప్రజావాణికి వారం వారం అర్జీల సంఖ్య పెరుగుతుందే తప్ప తరగడం లేదు. మండల, డివిజన్ స్థాయిలో అధికారుల నిర్లక్ష్యంతో కలెక్టరేట్ బాట పడుతుండగా ఇక్కడా అదే పరిస్థితి. వచ్చిన వారే మళ్లీ రావడం దరఖాస్తులు ఇవ్వడం పరిపాటిగా సాగుతోంది. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన ప్రజావాణిలో 227 అర్జీలు రాగా కలెక్టర్ డా.బి.గోపి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మీకిరణ్ స్వీకరించారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు చొరవ చూపారు. దరఖాస్తులు పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా అర్జీల్లో అత్యధికం వచ్చినవారే కనిపించడం ఆయా శాఖల పనితీరుకు తార్కాణం.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ గోపి

'ఇతడి పేరు కన్నం వెంకటయ్య. వయసు 84. హుజూరాబాద్ మండలం రాంపూర్ గ్రామం. తన తల్లి పేరిట వారసత్వంగా వచ్చిన భూమి కోసం న్యాయపోరాటం చేస్తున్నాడు. ఐదేళ్లుగా ప్రజావాణిని ఆశ్రయిస్తుండగా ఇప్పటివరకు 116సార్లు అర్జీలు పెట్టాడు. 714 సర్వే నంబర్‌లో 0.32గుంటల భూమిని ఇతర వ్యక్తులు కబ్జా చేశారని గతంలో కలెక్టరేట్‌లోనే కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తాను ఎవరికి భూమిని విక్రయించలేదని వాపోయాడు. న్యాయంగా రావాల్సిన 32గుంటల భూమిని ఇప్పించాలని వేడుకుంటున్నాడు'.



ప్రజావాణిలో..

మొత్తం అర్జీలు	227	మానకొండూర్ తహసీల్దార్	15
ధరణి సమస్యలు	50 (అంచనా)	శంకరపట్నం తహసీల్దార్	14
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్	26	రెండు పడకల ఇళ్లు	42 (మాన్యువల్)
కరీంనగర్‌రూరల్ తహసీల్దార్	25	రేషన్ కార్డులు	35 (అంచనా)
జిల్లా పంచాయతీ కార్యాలయం	16	ఇతర దరఖాస్తులు	46

ఏడాదిగా తిరుగుతున్నా



మా తండ్రి పోచయ్య మరణంతో గతేడాది ఏప్రిల్ 4న విరాసత్ కోసం దరఖాస్తు చేసుకున్నం. మేము ముగ్గురం అన్నదమ్ములం. ఇప్పటి వరకు ఎలాంటి మెస్సేజ్ రాలేదు. గతంలో ఇలాంటి వాటిని సత్వరమే చేసేవారు. ధరణి వల్ల మరింత ఆలస్యమే తప్ప పరిష్కారం లేదు. ఇంకెన్నాళ్లని తిరగాలే.

– కొయ్యాద తిమోతి, ఇప్పలపల్లి, వీణవంక

ఆర్ఎల్సీపై చర్యలు తీసుకోండి



మైనారిటీ గురుకులాల్లో అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలి. విజిలెన్స్ అధికారులు తనిఖీల పేరిట వెళ్లి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. నాన్‌టీచింగ్ సిబ్బందిని వేధిస్తున్నారు. అక్రమాలు బయటపడకూడదనే ఆర్ఎల్సీ కార్యాలయాన్ని ఇరుకుల్ల తరలించాలని ప్రయత్నిస్తున్నారు. కార్యాలయాన్ని ఇక్కడే కొనసాగించాలి. ఆర్ఎల్సీపై చర్యలు తీసుకోవాలి.

– కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం నేతలు

ఇల్లు కట్టుకున్నాం.. అయినా పట్టా చేశారు



30 ఏళ్ల క్రితం గ్రామంలో ఇల్లు కట్టుకున్నాం. కరెంట్ బిల్లులు, మోటార్ బిల్లులు కడుతున్నం. తీరా రాజయ్య అనే వ్యక్తి వచ్చి ఇది నా భూమి ఇళ్లన్నీ ఖాళీ చేయాలని బెదిరిస్తున్నాడు. పట్టా చేసుకున్నానంటూ కాగితాలు చూపిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. కలెక్టర్ గారూ మాకు న్యాయం చేయాలి.

– అంకటి వీరకుమార్, కరీంపేట, శంకరపట్నం

ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు దారి చూపండి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కరీంనగర్: జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల, ఓల్డ్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు దారి లేకపోవడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లే సమయంలో కిలోమీటర్ దూరం మెయిన్ రోడ్ గుండా వెళ్లాల్సిన పరిస్థితి ఉందని, పార్క్ గోడను కూల్చితే కిలోమీటర్ నడక తగ్గుతుందని విషయాన్ని పరిశీలించాలని ప్రజావాణిలో కలెక్టర్ గోపికి విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. మూడు గజాల అడ్డు గోడను కూల్చాలని గతంలో మంత్రి, కలెక్టర్, ఉన్నతాధికారులకు విన్నవించామని అయిన ఫలితం లేదని వాపోయారు. కలెక్టర్ జోక్యం చేసుకొని ప్రభుత్వ హాస్టల్‌లో చదివే విద్యార్థుల సౌకర్యార్థం సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు బామండ్ల రవీందర్, ఆంజనేయులు తదితరులు కోరారు.

సూరేపల్లి సుజాతకు పురస్కారం



సుజాత

కరీంనగర్‌కల్చరల్: తెరవే రాష్ట్ర శాఖ అందించే ఆచార్య జయశంకర్ స్మారక పురస్కారానికి శాతవాహన విశ్వ విద్యాలయం సోషియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ సూరేపల్లి సుజాత ఎంపికయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కొండి మల్లారెడ్డి, బూర్ల వెంకటేశ్వర్లు ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం దొడ్డి కొమురయ్య హాల్ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన భూ నిర్వాసితులు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నిర్వాసితులు

మానకొండూర్: ఎన్‌హెచ్ 563లో భూమి కోల్పోతున్న మానకొండూర్ మండలంలోని గట్టుదుద్దెనపల్లికి చెందిన భూ నిర్వాసితులు సోమవారం కలెక్టర్ గోపిని ప్రజావాణి కార్యక్రమంలో కలిసి, వినతిపత్రం అందించారు. సర్పంచ్ దేవ సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. రహదారి కింద కోల్పోతున్న వ్యవసాయ భూములకు, ఇళ్ల స్థలాలకు ఒకేలా పరిహారం ఇచ్చారని తెలిపారు. ఈ విషయాన్ని గత కలెక్టర్ కర్ణన్ దృష్టికి తీసుకెళ్లగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు నిర్వాసితులు తెలిపారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ధర్నా



నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

చొప్పదండి: రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ రెడ్డి సంక్షేమ సంఘం చొప్పదండి పట్టణ అధ్యక్షుడు గుర్రం రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ మినిస్టర్స్ క్వార్టర్స్ వద్ద ధర్నా నిర్వహించారు. పోలీసులు నిరసనకారులను అరెస్టు చేసి, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో ఉపాధ్యక్షుడు అన్నాడి సుధాకర్ రెడ్డి, నాయకులు కొత్త రవీందర్ రెడ్డి, గుర్రం రాజశేఖర్ రెడ్డి, కాట్నపల్లి రాజేశ్వర్ రెడ్డి తదితరులున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


- అప్పుల బాధతో ఈ నెల 9న ఆత్మహత్యాయత్నం

శంకరపట్నం: మండలంలోని గద్దపాక గ్రామానికి చెందిన నామని సుధాకర్(44) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కేశవపట్నం పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. సుధాకర్–స్వప్న దంపతులు వీణవంక మండలంలోని కోర్కల్ చేనేత సంఘంలో నేత పని చేస్తున్నారు. స్వగ్రామంలో రెండేళ్ల క్రితం ఇంటిని నిర్మించారు. ఇందుకోసం రూ.20 లక్షల వరకు అప్పులు చేశారు. వాటిని చెల్లించే మార్గం లేకపోవడంతో సుధాకర్ ఈ నెల 9న గద్దపాక వాగులో క్రిమిసంహారక మందు తాగాడు. ఈ విషయాన్ని ఇంట్లో ఎవరికీ చెప్పలేదు. 11న వాంతులు చేసుకోవడంతో కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

‘క్షయ’కలం

- కోరలు చాస్తున్న టీబీ
- రోజురోజుకూ పెరుగుతున్న కేసులు
- జిల్లాలో ఆందోళనకర పరిస్థితులు
- మందులు వాడితే 9 నెలల్లో నయం
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం

సాక్షి, కరీంనగర్ డెస్క్: కరీంనగర్ జిల్లాలో క్షయ కోరలు చాస్తోంది. చాపకింద నీరులా విస్తరిస్తూ కలవరపెడుతోంది. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు, కాలుష్యం, రోగ నిరోధకశక్తి లోపించడం వంటి కారణాలతో ఈ వ్యాధి వేగంగా వ్యాప్తి చెందుతోంది. దీంతో వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దగ్గుతో మొదలయ్యే వ్యాధిని ముదరక ముందే గుర్తించి, సరైన వైద్యం తీసుకుంటే నయమవుతుంది. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయంగా మారుతుంది. మందులు వాడకుండా నిర్లక్ష్యం చేస్తే ఇతరులకు అంటుకునే అవకాశం ఉంటుంది. క్షయను అరికట్టడానికి వైద్యారోగ్యశాఖ, క్షయవ్యాధి నియంత్రణ విభాగం ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నాయి.



అంటువ్యాధి..

క్షయ(ట్యూబర్‌క్యులోసిస్) ఒక అంటువ్యాధి. ఇది ఊపిరితిత్తులకు సంబంధించినదైనా చర్మము నుంచి మెదడు వరకు శరీరంలో ఏ భాగానికైనా వచ్చే అవకాశం ఉంది. మన దేశంలో దీర్ఘకాలిక రోగాలలో ప్రధానమైనది క్షయ. మైకోబాక్టీరియా లేదా మైకో బ్యాక్టీరియం ట్యుబర్క్యులోసిస్ అనే సూక్ష్మక్రిమి వల్ల ఈ వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి ఉన్నవారు దగ్గినా, తుమ్మినా గాలి ద్వారా ఇతరులకు వ్యాప్తి చెందుతుంది.

కరీంనగర్ టౌన్‌లో అధికారిక లెక్కల కంటే ఎక్కువే..

జిల్లాలో 6 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. అధికారిక లెక్కల ప్రకారం.. ఒక్క కరీంనగర్ పట్టణంలోనే ఈ ఏడాది 250 మందికి క్షయ సోకింది. క్షేత్రస్థాయిలో రోగుల సంఖ్య ఎక్కువే ఉంటుందని సమాచారం.

వ్యాధిగ్రస్తులకు రూ.500..

క్షయవ్యాధితో బాధపడుతున్న వారికి ప్రభుత్వం ఉచితంగా వైద్యపరీక్షలు చేయిస్తూ, మందులు అందిస్తోంది. బాధితులు క్రమం తప్పకుండా మందులు వాడటంతోపాటు పౌష్టికాహారం తీసుకోవాలి. ఇందుకు వారిపై ఆర్థికభారం పడకుండా ఉండేందుకు నెలకు రూ.500 అందిస్తోంది.

లక్షణాలు ఇవే..

తెమడ లేదా పొడి దగ్గుతోపాటు సాయంత్రం వేళలో తీవ్రమైన జ్వరం, తలనొప్పి వస్తాయి. క్రమేణా బరువు తగ్గిపోవడం, ఆకలి మందగించడం వంటివి జరుగుతాయి. వ్యాధికి తగిన చికిత్స చేయించుకోకపోతే ప్రాణాలకే ప్రమాదం. ప్రతి లక్ష మంది జనాభాలో 300 మంది క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్నారని అంచనా.

వివరాలు తెలపాలి

ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటున్న రోగుల వివరాలను క్షయ నియంత్రణ శాఖకు తెలపాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ఈ వ్యాధిని పూర్తిగా నియంత్రించేందుకు మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రతినెలా ఉచితంగా అందిస్తారు. తీవ్రమైన దగ్గుతో బాధపడుతున్నవారు వెంటనే అందుబాటులో హాస్పిటల్‌లో సంప్రదించి, వైద్య పరీక్షలు చేయించుకోవాలి. కరోనా తర్వాత పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. కరోనా సమయంలో టీబీ బారినపడినవారే ఎక్కువ మంది చనిపోయారని వైద్యశాఖ అధికారులు చెబుతున్నారు.

టీబీ యూనిట్లు, డీఎంసీలు..

జిల్లాలో టీబీ యూనిట్లు, డీఎంసీల ద్వారా క్షయ వ్యాధి నిర్ధారణ, చికిత్స అందిస్తున్నారు. వ్యాధి ఉన్నట్లు తేలితే ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. సకాలంలో గుర్తించి, మందులు వాడితే 9 నెలల్లోనే క్షయ పూర్తిగా నయమవుతుంది.

ముందు జాగ్రత్తలతో చెక్



ముందు జాగ్రత్తలతో టీబీ నివారించవచ్చు. తరచూ జ్వరం రావడం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం లాంటివి ఉంటే డాక్టర్లను సంప్రదించడం బెటర్. బీపీ, షుగర్, ఆస్తమ ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. ఒక వేళ వ్యాధిసోకినా.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫ్రీగా మందులు ఇస్తారు. క్రమం తప్పకుండా మెడిసిన్ వాడితే క్షయను అరికట్టవచ్చు. పెద్దపల్లి జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 832 మంది బాధితులు పేర్లు నమోదుచేసుకున్నారు.

– సురేందర్, పెద్దపల్లి జిల్లా టీబీ నియంత్రణ అధికారి

దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటు చేయాలి



వినోద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని కురుమ, యాదవ సంఘం జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మేయర్ వై.సునీల్‌రావులను కలిసి వినతిపత్రం అందించారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని నగరంలోని ఓ కూడలిలో తప్పకుండా ఏర్పాటు చేద్దామని అన్నారు. ఈ విషయమై మేయర్‌కు సూచన చేశారు. నల్లగొండ జిల్లా కడివెండి గ్రామంలో జన్మించిన ఆయన పూర్వపు పటేల్, పట్వారీ, జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం దొడ్డి కొమురయ్య వర్ధంతి, జయంతిలను అధికారికంగా నిర్వహిస్తోందని చెప్పారు. త్వరలోనే మంత్రి గంగుల కమలాకర్‌తో మాట్లాడి, విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మీస బీరయ్య, ఐలయ్య, అశోక్, పావని, రవి, శ్రీనివాస్, నాగరాజు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ ఒక్క సీటూ గెలవదు



మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి, పక్కన నాయకులు

విద్యానగర్(కరీంనగర్): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 సీట్లలో బీఆర్‌ఎస్ పార్టీ ఒక్క సీటూ గెలవదని కాంగ్రెస్ కరీంనగర్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ గెలుస్తుందని మంత్రి గంగుల కమలాకర్ చెబుతున్నారని, కానీ సీన్ రివర్స్ కాబోతోందని తెలిపారు. నాసిరకం పనులతో కుంగుతున్న కేబుల్ బ్రిడ్జి నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే వీకెండ్ మస్తీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేశారు. కెబుల్ బ్రిడ్జి పైకి భారీ వాహనాలను అనుమతించకపోవడంలో మతలబు ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో మట్టిరోడ్లు లేకుండా చేస్తున్నామని చెబుతున్న మంత్రి శివారు డివిజన్ల అభివృద్ధిని ప్రస్తావించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సమద్ నవాబ్ మాట్లాడుతూ.. ఖాజీపూర్‌లోని ఫాంహౌస్ వక్ఫ్ బోర్డు ఆస్తి కాదని నిరూపిస్తే తాము ఏ శిక్షకైనా సిద్ధమేనన్నారు. నాయకులు ఎండీ.తాజ్, రహ్మత్ హుస్సేన్, కుర్ర పోచయ్య, దండి రవీందర్, ములకల కవిత, ఎండీ.చాంద్, జీడి రమేశ్, ఎగ్గడి శారద, లయాక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి జూనియర్స్ జూడో జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్: కరీంనగర్ మంకమ్మతోటలోని సాయి మానేరు పాఠశాల జూడో అకాడమీలో బుధవారం జిల్లాస్థాయి జూనియర్స్ పురుషుల, మహిళల జూడో జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జూడో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కడారి అనంతరెడ్డి, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులకు 55, 60, 66, 73, 81, 90, 100 కేజీలు ఆపైన, మహిళలకు 48, 52, 57, 63, 70, 78 కేజీలలోపు ఆపైన విభాగాల్లో పోటీలను జరపనున్నట్లు పేర్కొన్నారు. 2003, 2004, 2005, 2006, 2007, 2008 సంవత్సరాల్లో పుట్టిన క్రీడాకారులు అర్హులన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో రాణించిన వారిని ఈ నెల 19, 20 తేదీల్లో కరీంనగర్‌లో జరిగే 8వ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు మధ్యాహ్నం 1 గంటలకు సాయి మానేరు పాఠశాలలోని జూడో అకాడమీలో రిపోర్టు చేయాలని, పూర్తి వివరాలకు 99498 30494 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

‘బీజేపీవి ఊకదంపుడు ఉపన్యాసాలు’

- నైట్ విజిల్ కార్యక్రమంలో నాయకులు



విజిల్ వేస్తున్న నాయకులు

కరీంనగర్: దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి సంబంధం లేని బీజేపీ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ కపట దేశభక్తిని ప్రదర్శించడాన్ని నిరసిస్తూ తెలంగాణ చౌక్‌లో సోమవారం రాత్రి 7 నుంచి 9.30 గంటల వరకు సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు నైట్ విజిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ, స్వాతంత్ర్య ఉద్యమానికి అణువంత సంబంధంలేని బీజేపీ నేడు కేంద్రంలో పరిపాలిస్తుందన్నారు. బీజేపీ మాతృ సంఘం ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంలో 2002 వరకు జాతీయ జెండా ఆవిష్కరించలేదని, నాడు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ప్రజలను కులాలు, మతాల పేర్లతో విభజన సృష్టించి ఉద్యమ ఐక్యతను దెబ్బతీశారన్నారు. ఉద్యమకారుల ఆశయాలు, దేశ సహజ సంపద, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడడం కోసం ప్రజాసంఘాలు నిరంతరం పోరాటం చేస్తాయని, బీజేపీ గద్దెనెక్కకుండా ఎక్కడికక్కడ తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గీట్ల ముకుందరెడ్డి, ఎడ్ల రమేశ్, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వాసుదేవారెడ్డి, అధ్యక్షుడు వర్ణ వెంకట్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్, గుడికందుల సత్యం, రాజేశం, భీమాసాహెబ్, రత్నం సురేష్, స్వామి, విద్యాసాగర్, నరసింహారెడ్డి, అంజయ్య, సదానందచారి, మల్లయ్య, శ్రీనివాస్, సంపత్‌కుమార్, జగదీష్, లింగారెడ్డి, వెంకటేశ్వర్లు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిపై జెండా ఎగురవేయండి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి

కరీంనగర్‌టౌన్: దేశ ఐక్యతకు పాటుపడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ఉత్సవాల ముగింపు, నా మట్టి.. నా దేశం ప్రోగ్రాంలో భాగంగా బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రేకుర్తిలోని ఢిల్లీ డిఫెన్స్ అకాడమీలో పంచప్రాన్ ప్రతిజ్ఞ కార్యక్రమం జరిగింది. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ జాతీయ శాఖ పిలుపు మేరకు ఈనెల 30 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జెండా ఎగురవేయాలని కోరారు. నాయకులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, ఆనంద్, జితేందర్, సత్యనారాయణరెడ్డి తదితరులున్నారు.

దేశాన్ని ముక్కలు చేయించిన ఘనత కాంగ్రెస్‌దే

‘మేరీ మాటీ.. మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 14 దేశ విభజన గాయాల స్మారక దినం సందర్భంగా బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ నుంచి రెవెన్యూ గార్డెన్ వరకు మౌన ప్రదర్శన చేపట్టారు. అనంతరం రెవెన్యూ గార్డెన్‌లో దేశ విభజనకు సంబంధించి డాక్యుమెంటరీ ప్రదర్శన, ఫొటో ఎగ్జిబిషన్, సభ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. దేశాన్ని ముక్కలు చేయించిన ఘనత కాంగ్రెస్‌దే అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిషర్ల ధమనకాండ కన్నా, విభజన వల్ల జరిగిన రక్తపాతమే అధికమని, దాదాపు 10 లక్షల మంది ఊచ కోతకు గురయ్యారని తెలిపారు. సుద్దాల దేవయ్య, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కళ్లెం వాసుదేవరెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, బోయినపల్లి ప్రవీణ్ రావు తదితరులున్నారు.

అనుమతిలేని హోర్డింగ్స్‌పై చర్యలు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన హోర్డింగ్స్ వ్యవహారంలో అక్రమాలకు పాల్పడినట్లు దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామని నగరపాలకసంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీహరి తెలిపారు. నగరపాలక సంస్థ అన్ని నిబంధనలకు లోబడే యాడ్ ఏజెన్సీలకు హోర్డింగ్స్ ఏర్పాటుకు అనుమతినిస్తుందన్నారు. ఒకవేళ ఎక్కడైనా హోర్డింగ్స్ ఏర్పాటులో అవకతవకలకు పాల్పడినట్లు తెలిస్తే, నగరపాలకసంస్థ దృష్టికి తీసుకురావచ్చని చర్యలు తీసుకుంటామన్నారు.

జర్నలిస్టులందరికీ నివేశన స్థలాలివ్వాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయం

విద్యానగర్(కరీంనగర్): జిల్లాలోని జర్నలిస్టులందరికీ నివేశన స్థలాలివ్వాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (ఐజేయూ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో జర్నలిస్టులు తరలివచ్చి, తమకు వెంటనే నివేశన స్థలాలివ్వాలంటూ నినాదాలు చేశారు. ధర్నా శిబిరానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు వచ్చి, తమ మద్దతు ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్‌కుమార్, పార్టీల నాయకులు గంగాడి కృష్ణారెడ్డి, వెంకటమల్లయ్య, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మేన్నేని రోహిత్‌రావు, వైద్యుల అంజన్ కుమార్, గంగాధర కనకయ్య, కల్యాడపు ఆగయ్య, గులాం అహ్మద్ హుస్సేన్, అంబటి జోజిరెడ్డి, సృజన్‌కుమార్, వాసుదేవరెడ్డి, డాక్టర్ నగేశ్, శ్రీనివాస్, మణికంఠ రెడ్డి తదితరులు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తే ప్రభుత్వం వారి కనీస అవసరాలు తీర్చకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలిచే జర్నలిస్టుల పరిస్థితే ఇలా ఉంటే సామాన్యుల మాటేమిటని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారం కోసం జర్నలిస్టులు తమ కలాలకు పదును పెట్టాలని, అప్పుడే పాలకులు దిగివస్తారని చెప్పారు. ఆ దిశగా ధైర్యంగా అడుగులు వేయాలని, తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు తాడూరు కరుణాకర్, నాయకులు పాల్గొన్నారు.

నిస్వార్థ నాయకులకే సమాజంలో గుర్తింపు



నివాళి అర్పిస్తున్న నాయకులు

తిమ్మాపూర్: ప్రజల సంక్షేమం కోసం నిస్వార్థంగా పనిచేసే రాజకీయ నాయకులకే సమాజంలో గుర్తింపు ఉంటుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, కిసాన్ మోర్చా మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి పొల్సాని సుగుణాకర్‌రావు అన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు, తిమ్మాపూర్ మండలంలోని మక్తపెల్లికి చెందిన తమ్మిశెట్టి మల్లయ్య ఈ నెల 9న మృతి చెందారు. పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఆయన సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. మల్లయ్య మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సత్సంబంధాలు కలిగి ఉండేవారన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు వాసుదేవరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, అధికార ప్రతినిధులు స్వామి, కల్యాణ్ చంద్ర, రాష్ట్ర నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, అజయ్ వర్మ, దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రెడ్డి, మానకొండూర్ అసెంబ్లీ కన్వీనర్ జగన్‌రెడ్డి, సీపీఐ అధ్యక్షుడు తిరుపతి, వైఎస్సార్‌టీపీ నాయకుడు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి బలవన్మరణం

గంగాధర: మండలంలోని మల్లాపూర్‌కు చెందిన తూడి నర్సయ్య(60) ఆత్మహత్యకు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. నర్సయ్య తాపీమేస్త్రీగా పని చేసేవాడు. కొన్ని రోజులుగా ఆయన మానసిక స్థితి సరిగా ఉండటం లేదు. ఆదివారం ఇంటి నుంచి పొలం వద్దకు వెళ్లి, చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి భార్య దేవవ్వ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

రాజీవ్ రహదారిపై కారు బోల్తా

- ముగ్గురు యువకులకు స్వల్ప గాయాలు
- అతివేగం, మద్యం మత్తే కారణం?



తిమ్మాపూర్: మండల కేంద్రంలో రాజీవ్ రహదారిపై ఓ కారు బోల్తా పడింది. స్థానికుల కథనం ప్రకారం.. తిమ్మాపూర్ మండలంలోని రేణికుంటకు చెందిన అయిదుగురు యువకులు సోమవారం సాయంత్రం కరీంనగర్ నుంచి రేణికుంటకు కారులో వస్తున్నారు. తిమ్మాపూర్ స్టేజి వద్ద ముందు వెళ్లే ఆర్టీసీ బస్సును అతివేగంగా ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో కారు డివైడర్ ఎక్కి, బోల్తా పడింది. స్థానికులు వెంటనే అక్కడికి చేరుకొని, లోపల ఉన్నవారిని బయటకు తీశారు. వారిలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఆ యువకులు మద్యం మత్తులో ఉన్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఐ లవ్ ఇండియా సైకత శిల్పం



కరీంనగర్ కల్చరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్‌లోని మంకమ్మతోటకు చెందిన సైకత శిల్పి రేవెల్లి శంకర్ సోమవారం తన ఇంట్లో ఐ లవ్ ఇండియా పేరిట సైకత శిల్పం రూపొందించారు. చేతుల్లో ఒదిగిన పతాకంతో కూడిన ఈ శిల్పాన్ని స్థానికులు పరిశీలించి, శంకర్‌ను అభినందించారు.

సాక్షి ఫ్యామిలీ

IV

నిజామాబాద్

మంగళవారం ॥ 15-8-2023

ఆగస్టు 15

ఆమె... దేశంలో సగం ఎప్పుడు!?

స్వాతంత్య్ర దినోత్సవం దేశ ఔన్నత్యాన్ని మాట్లాడుతుంది. దేశ ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తుంది. కాని దేశంలో సగమైన స్త్రీలు సంపూర్ణ స్వాతంత్య్ర ఫలాలు ఇంకా పొందవలసే వుంది. ఏనాడైతే స్త్రీల పట్ల సురక్షితమైన, సంస్కారవంతమైన ప్రవర్తనను ఈ సమాజం చూపుతుందో అప్పుడే స్త్రీలకు సంపూర్ణ స్వాతంత్య్రం వచ్చినట్టు. అప్పుడే దేశ ఔన్నత్యం ఇనుమడించినట్టు. 'ఆకాశంలో సగం'లాగా దేశంలో సగం ఇంకెప్పుడు?



నేడు ఆగస్టు 15న ఎర్రకోట మీద జెండా ఎగుర వేసే సమయంలో ప్రధాని నరేంద్ర మోదీకి ఇద్దరు మహిళా ఆర్మీ ఆఫీసర్లు సహకారం అందిస్తారు. మేజర్ నికితా నాయర్, మేజర్ జాస్మిన్ కౌర్ పతాకావిష్కరణ సమయంలో ప్రధానితో పాటుగా ఉండి జెండా వందనం సమర్పిస్తారు. ఈ విశేష ఘట్టంలో ఇద్దరు మహిళలకు ఈ విధంగా చోటు దక్కడం సంతోషపడాల్సిన సంగతి. 76 ఏళ్ల క్రితం స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి నేటి వరకు స్త్రీల స్థితిగతుల్లో వచ్చిన పురోభివృద్ధికి ఇదీ ఒక సంకేతమే. నాటి నుంచి నేటి వరకు విద్య, ఉపాధి, ఉద్యోగం, సైన్యం, పాలనా యంత్రాంగం, శాసన వ్యవస్థ... వీటిల్లో స్త్రీలకు గణనీయంగా స్థానం దక్కింది. ప్రాముఖ్యం లభించింది. అయితే అంతమాత్రాన స్త్రీలు సంపూర్ణంగా స్వాతంత్య్ర ఫలాలు అనుభవిస్తున్నారా అనేది ప్రశ్న.

స్త్రీల త్యాగం

దాస్య భారతంలో జరిగిన స్వాతంత్య్ర పోరాటంలో ఎందరో స్త్రీలు పాల్గొన్నారు. అన్నింటికి మించి పురుషులు దేశం కోసం ప్రాణాలు అర్పించినా, జైళ్ల పాలైనా స్త్రీలు ధైర్యంగా ఇళ్లు నడిపి కష్టాలను ఈదారు. దేశ విభజన సమయంలో తీవ్ర హింసను ఎదుర్కొన్నారు. అంతెందుకు 1930 నాటికి దేశ వ్యాప్తంగా 30 వేల మంది స్త్రీలు స్వాతంత్య్ర పోరాటంలో ఏదో విధాన జైలు శిక్ష అనుభవిస్తున్నారని తెలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఈ స్త్రీల పోరాటం చాలామటుకు చరిత్రలో నమోదు కాకుండానే కాలగర్భంలో కలిసిపోయింది. ఇప్పుడిప్పుడే నాటి వీర వనితల గాధలు వెలికి వస్తున్నాయి. ఇంత పోరాటం, త్యాగం చేసి స్త్రీల భాగస్వామ్యంతో తెచ్చుకున్న స్వాతంత్య్రంలో స్త్రీలు నిజంగా సంతోషంగా ఉన్నారా?

సురక్షితం కాని దేశం

'ఒక స్త్రీ అర్ధరాత్రి క్షేమంగా నడిచి వెళ్లినప్పుడే ఈ దేశానికి నిజమైన స్వాతంత్య్రం వచ్చినట్టు' అని గాంధీజీ ఏ ముహూర్తంలో అన్నారో కాని అలాంటి స్థితి నేటికీ రాకపోగా నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. ఎన్ని చట్టాలు చేసినా, శిక్షలు తెచ్చినా స్త్రీలను గౌరవించాలి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడాలి అని మెజారిటీ సమాజం అనుకోవడం లేదు. 'నస్త్రీ స్వాతంత్య్ర మర్హతి' అనే భావన సమాజంలో ఆది కాలం నుంచి చొప్పించి ఉండటం వల్ల స్త్రీ చేసే ప్రతి పనిలో తప్పు ఎంచడం, అదుపు చేయడం, చులకనగా చూడటం, వివక్ష చూపడం, దండించడం ఆనవాయితీగా మారింది. పిల్లల పెంపకం దశ నుంచే స్త్రీలను గౌరవించడం నేర్పించడం లేదు. ఇంట్లో అమ్మాయిని ఒకలాగా, అబ్బాయిని ఒకలాగా పెంచడం వల్ల ఈ అబ్బాయిలు 'సమాజం'గా మారి స్త్రీ పాలిట బెడదగా మారుతున్నారు. తమ మాటకు ఎటువంటి తిరస్కారం చెప్పినా పురుషుడు శిక్షించేవాడై స్త్రీని చంపేందుకు వెనుకాడటం లేదు. స్త్రీకి ఒక అభిప్రాయం కలిగి ఉండే స్వాతంత్య్రం ఆమెకు ఎందుకు ఇవ్వడం లేదు?

స్త్రీలను ప్రేమ, మర్యాద, గౌరవాలతో కుటుంబం చూసుకోవాలి. అప్పుడు ఆ మర్యాద, గౌరవాలు సమాజంలోకి ఆటోమేటిక్‌గా వస్తాయి. కుటుంబం స్త్రీకి ఎలా రక్షణ ఇస్తుందో సమాజం కూడా స్త్రీకి అలా రక్షణ ఇవ్వాలనే పౌర శిక్షణ, సంస్కారం అవసరం. పురుషులు మాత్రమే కాదు స్త్రీలు కూడా కుటుంబం, సమాజం, దేశం కోసం గొప్పగా ఆలోచించగలరు. వారికి స్వేచ్ఛ, స్వాతంత్య్రం ఇచ్చి చూస్తే తెలుస్తుంది. అటువంటి వేకువలోకి దేశం ఉదయించాలని ఈ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా కోరుకుందాం.

స్వాతంత్ర్యాన్ని ఇలా ఎంజాయ్ చేయండి!

నేటి టెక్నాలజీ యుగంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని హాలిడేగా తీసుకుని ఆనందించే వారే ఎక్కువ. స్కూలు, కాలేజీ విద్యార్థులైతే జెండా వందనం తరువాత ఇంటికెళ్లిపోవచ్చు అని తెగ సంబరపడిపోతుంటారు. కానీ డెబ్బై ఆరేళ్లుగా విరామం లేకుండ జరుపుకొంటూ నేడు 77వ వసంతంలో అడుగు పెట్టాం. దేశాన్ని పాలించే అధికారులు అధికారికంగా ఈ వేడుకలు జరిపిస్తున్నారు. బాధ్యత గల పౌరులుగా మనం ఇలా సెలబ్రేట్ చేసుకుందాం....



- ఉదయాన్నే ఎర్రకోటపై జరిగే జెండావందనం, వివిధ కార్యక్రమాలను టీవీలో చూడాలి. డెబ్బై ఏడేళ్ల స్వాతంత్య్ర భారతం ఎంత ఎత్తుకు ఎదిగిందన్న అంశాలను ప్రత్యక్ష ప్రసారాలు చూడడం ద్వారా తెలుసుకోవచ్చు
- తరువాత ఎప్పటి నుంచో అనుకుంటున్న ప్లేసుకి ఈరోజు వెళ్లండి. ఒక రోజులో వెళ్లిరాగల ప్రాంతానికి వెళ్లి అక్కడ గడిపి మీ ఒత్తిడిని దూరం చేసుకోండి. అక్కడ స్వతంత్ర దినోత్సవాన్ని గుర్తుండిపోయేలా గడపండి.
- రోజూ వేసుకునే దుస్తులు కాకుండా భారతీయ సంప్రదాయం ఉట్టిపడేలాంటి దుస్తులు ధరించండి. వీలైనంత వరకు డ్రెస్‌లో తెలుపు, కాషాయం, ఆకుపచ్చని రంగులు ఉండేలా చూసుకుని వేసుకోవాలి. అప్పుడు త్రివర్ణ పతాకానికి మరింత వన్నె తెచ్చిన వారవుతారు
- ఎక్కడికీ వెళ్లే ఓపిక లేనప్పుడు ఇంట్లోనే ఉండి దేశభక్తి సినిమాలు చూడండి. మీతోపాటు మీ పిల్లలకు మన దేశ చరిత్ర, ఔన్నత్యాలు తెలుస్తాయి
- మరింత ఉత్సాహంగా సెలబ్రేట్ చేసుకోవాలంటే మూడు రంగులు ఉండేలా వెరైటీ డిష్‌లు తయారు చేసుకుని తినండి
- స్వాతంత్య్ర దినోత్సవం అర్థం ఉట్టిపడేలా గాలిపటాలు ఎగరవేయండి. మూడు రంగుల్లో ఉన్న గాలిపటాలను వీలైనంత ఎత్తుకుఎగరేస్తూ మనకొచ్చిన స్వేచ్ఛను ఎంజాయ్ చేయవచ్చు
- పుస్తకాల పురుగులు అయితే దేశభక్తి పుస్తకాలను చదవండి. స్వాతంత్య్ర సమర యోధుల విజయగాధలు, వీరిలో బాగా పాపులర్ అయిన నాయకుల బయోగ్రఫీని చదివి ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు
- దేశభక్తి గీతాలు వింటూ కూడా సంబరాలు జరుపుకోవచ్చు. అలనాటి పోరాట, అసామాన్య త్యాగాలను గుర్తుచేసే పాటలను వినాలి. లతా మంగేష్కర్, మహ్మద్ రఫీ, ఏఆర్ రెహ్మాన్ పాటలు మనలో నిద్రపోతున్న దేశభక్తిని తట్టి లేపుతాయి
- ఇంటి చుట్టుపక్కల వారు లేదా బంధువులు, కుటుంబ సభ్యులతో దగ్గరలో జరుగుతోన్న జెండా పండుగకు వెళ్లి రెపరెపలాడే త్రివర్ణ పతాకానికి జైహింద్ కొట్టాలి
- దేశానికి పెద్ద సేవ చేయలేక పోయినప్పటికీ మీ చుట్టుపక్కల ఉన్న వారందరికి స్వీట్లు పంచి, నోరు తీపి చేస్తూ స్వతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకోండి.

ప్రతి భారతీయుడికి ఎంతో విలువైన బహుమతులు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు. అందుకే వీలైనంత వరకు అందరితో కలిసి జరుపుకోవాల్సిన జెండా పండుగ ఇది. సెలవు దొరికింది అని సంబరపడిపోక వీటిలో ఏ ఒక్కదాన్ని పాటించినా స్వాతంత్య్ర దినోత్సవాన్ని గౌరవించినట్లే.



ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్, శిక్ష(ణ)లో ఉన్న మహిళలే నిర్వాహకులు

77వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా...

ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్

కారాగారంలో గడిపే సమయం శిక్ష సమయం కాదు, శిక్షణ సమయం. కారాగారం మానసిక పరివర్తన దిశగా శిక్షణ ఇచ్చే ప్రదేశం. శిక్ష పూర్తయి విడుదలైన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడానికి అవసరమైన నైపుణ్య శిక్షణ కూడా ఇచ్చే ప్రదేశంగా ఉండాలి. అలాగే ఉంటాయి కూడా. అయితే ఈ ఏడాది దేశం మరో అడుగు ముందుకేసింది. శిక్ష అనుభవిస్తున్న మహిళలకు ఉపాధి అవకాశాలను జైలు గోడల మధ్య కాకుండా సమాజంలో కల్పించడం ఈ స్వాతంత్య్ర దినోత్సవం ప్రత్యేకత.

చెన్నై నగర శివారులో అంబత్తూరు– పుఝల్ రోడ్డులో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు 'ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్' అనే ప్రయోగాత్మకమైన సంస్కరణకు వేదికైంది. పుఝల్ మహిళల కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న మహిళల్లో ముప్పై మందికి ఉద్యోగం ఇచ్చింది. దేశంలో ఇదే మొదటి ప్రయత్నం. ఈ ప్రయత్నంతో ఈ పెట్రోల్ బంకు ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్ అనే గౌరవ సూచికకు అర్హత సాధించింది. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పన్నెండు గంటలు మహిళలు విధులు నిర్వర్తిస్తారు. ఆ తర్వాత పురుష ఖైదీలు విధుల్లోకి వస్తారు.

ఖైదీలు తమ శిక్ష కాలం పూర్తయిన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడం కోసం రకరకాల వృత్తుల్లో శిక్షణ ఇస్తారు. అవన్నీ జైలు గోడల మధ్యనే ఉంటాయి. మారుతున్న సమాజానికి తగినట్లు కొత్త కొత్త ఉపాధి మార్గాలకు తగిన ఏర్పాట్లు ఉండవు. అందుబాటులో ఉన్న పనుల్లోనే శిక్షణ ఇవ్వడమే జరిగేది. ఇదిలా ఉంటే... జైళ్లలో మహిళా ఖైదీలకు తగిన సౌకర్యాల పర్యవేక్షణ కోసం అన్ని రాష్ట్రాల్లో పర్యటించిన మహిళా కమిషన్ సభ్యుల పరిశీలనలో కొత్త విషయాలు తెలిశాయి. జైలు గోడల మధ్య ఉండడం వల్ల మహిళలు మానసికంగా కుంగుబాటుకు లోనవుతున్నారని, వారికి సమాజంలో భాగస్వామ్యం కల్పించాలని సూచించడంతో, ఆ సూచనను అందుకున్న జైలు అధికారుల్లో మొదటగా పుఝల్ జైలు అధికారులు ఈ ప్రయత్నం చేశారు. మహిళలకు పెట్రోల్ పట్టడంలో శిక్షణ ఇవ్వడంతోపాటు వినియోగదారులతో మాట్లాడడం, ఉద్యోగానికి తగిన ప్రవర్తనా నియమావళిలో కూడా మహిళలకు శిక్షణ ఇప్పించారు.

పెట్రోల్ బంకులో విధులు నిర్వర్తిస్తున్న మహిళలు తమకు స్వాతంత్య్రం వచ్చినట్లు సంతోషిస్తున్నారు. శిక్ష కాలాన్ని ఆనందంగా పూర్తి చేస్తామని, పరిపూర్ణమైన వ్యక్తిత్వంతో సమాజంలోకి విడుదలవుతామని చెప్పారు.

శిక్ష కాలం సమాజంలోనే!

శిక్షణ కాలంలో మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్కరణలు తీసుకురావడంతోపాటు ఖైదీలను సమాజంతో అనుసంధానం చేయడం, వారి పునరావాసం కోసం పని చేయడం కూడా అవసరమే. ఆ అవసరాన్ని గుర్తించి మహిళలతోనే ముందడుగు వేసింది జైళ్ల శాఖ. శిక్ష సమయంలో కూడా సమాజంలో మనుషులతో మాట్లాడుతూ ఉంటే మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. సమాజానికి దూరంగా ఉన్నామనే ఆవేదన దూరమవుతుంది. సమాజంలోనే నివసిస్తున్న భావనతో జీవిస్తారు.

జీవన సేద్యం!

- పెద్ద కమతాల్లో సేంద్రియ వరి సేద్యంలో జీవన ఎరువులు/పురుగుమందులు కీలకం



వ్యవసాయ క్షేత్రంలో సిద్ధమవుతున్న జీవన ఎరువులు

సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ద్రావణాలు, కషాయాలను చిన్న, సన్నకారు రైతులు తయారు చేసుకొని వాడగలుగుతున్నారు. అయితే, ఎక్కువ విస్తీర్ణంలో సేంద్రియ/ప్రకృతి సేద్యం చేసే పెద్ద రైతులకు వీటి తయారీ కష్టం కావటంతో జీవన ఎరువులు, జీవన పురుగుమందులను విరివిగా వినియోగిస్తున్నారు. రైతు శాస్త్రవేత్త, తునికిలోని ఏకలవ్య కేవీకే సలహాదారు, హార్ట్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఎం.ఎస్.సుబ్రహ్మణ్యం రాజు గత కొన్ని సంవత్సరాలుగా చిన్న, పెద్ద కమతాల్లో సాగు చేసే రైతులతో కలసి పనిచేస్తున్నారు. ఖరీఫ్/లేటు ఖరీఫ్ వరి సాగులో చిన్న కమతాల రైతులు, పెద్ద కమతాల రైతులు ఏయే ఉత్పాదకాలను, ఎంతెంత మోతాదులో వాడితే మంచి ఫలితాలు వస్తున్నాయన్న అంశాలను ఆయన 'సాక్షి సాగుబడి'కి ఇలా వివరించారు.

వరి నారుమడిని నీరు నిలవని విధంగా తయారు చేసుకోవాలి. విత్తనాన్ని ఒక రోజు ముందు ఎండబెట్టి మరునాడు విత్తన శుద్ధి చేయాలి. నిద్రావస్థ ఉన్న విత్తనాలను, నిద్రావస్థ తొలగించడానికి గోరువెచ్చని నీటిలో నానబెట్టి, అనంతరం విత్తనాలను నారుమడిపై వెదజల్లాలి. 2వ రోజు నీరు బయటకు తీయాలి. 5వ రోజు నీరు పెట్టాలి. తర్వాత తగినంత నీరు ఇస్తుండాలి. చాలా ప్రాంతాల్లో నారు 6 అంగుళాల సైజు నుంచి 10 అంగుళాల సైజు వచ్చినప్పుడు మాత్రమే ఊడ్పు/నాట్లు వేస్తుంటారు. నాట్లు వేసిన 7 రోజులకు.. చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ నాట్లు వేయాలి.

ప్రధాన పొలాన్ని ఊడ్పుకు ముందు 20 రోజుల నుంచి దఫ దఫాలుగా వారానికి ఒకసారి దుక్కి దున్ని, చదును చేసుకోవాలి. ఎకరాకు 3 నుంచి 5 టన్నుల పశువుల ఎరువు వెయ్యాలి. నాట్లతో పాటుగా వివిధ రకాల జీవన ఎరువుల (బ్యాక్టీరియాల)ను ఇవ్వాలి. మొక్కల మధ్య 20 సెం.మీ. దూరం ఉండేలా వరి నాట్లు వేయాలి. మధ్యలో కాలి బాటలు తీయాలి. గట్లపై నువ్వుల విత్తనాలను చల్లుకుంటే నువ్వుల పువ్వులు ఎనాగరస్ అనే కీటకాన్ని ఆకర్షించటం ద్వారా తెల్లదోమ నివారణ జరుగుతుంది.

సేంద్రియ వరి సాగులో చిన్న, పెద్ద రైతులకు అనువైన ఉత్పాదకాల పట్టిక

వివరణ	చిన్న రైతులకు అనువైన ప్రాచీన పద్ధతులు	పెద్ద రైతులకు అనువైన ఆధునిక పద్ధతులు
1వ రోజు విత్తనశుద్ధి	బీజామృతంతో విత్తన శుద్ధి చేయాలి	హ్యూమిక్ యాసిడ్, బవేరియా, మెటారైజియం, సూడోమోనాస్
10వ రోజు పిచికారీ	జీవామృతం + పంచగవ్య + పుల్ల మజ్జిగ	మీనామృతం + సూడోమోనాస్+ తౌడు కషాయం
12వ రోజు ఎరువు	ఘనజీవామృతం	ఘనజీవామృతం / వర్మీకంపోస్టు + హ్యూమిక్ ఆసిడ్
20వ రోజు సస్యరక్షణ	ఆగ్నేయ అస్త్రం + జీవామృతం + మొలకల ద్రావణం	మీనామృతం + బేవేరియా, మెటారైజియం + వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
ఊడ్పు అనంతరం 22వ రోజు స్ప్రే	పంచగవ్య + అగ్ని అస్త్రం + పుల్ల మజ్జిగ	మీనామృతం+బవేరియా +మెటారైజియం+ వెర్టిసీలియం + కొబ్బరి నీరు పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగుకు ల్యూర్ పెట్టాలి లేదా ట్రైకోగ్రామా కార్డులు పెట్టాలి లేదా తూజా 200 (హోమియో) పిచికారీ చేయాలి.
25వ రోజు ఊడ్పు	ఘనజీవామృతం 1 టన్ను / 1 ఎకరం + వేప పిండి 200 కిలోలు/ఎకరం	ఘనజీవామృతం 1 టన్ను/ 1ఎ + బ్యాక్టీరియాలు, ఎన్‌పికె, బవేరియా, మెటారైజియం బాక్టీరియాలు.
25 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
35 రోజులకు	మొలకల ద్రావణం + ఆగ్నేయ అస్త్రం + ఇంగువ కషాయం లేదా పుల్ల మజ్జిగ పిచికారీ చేయాలి.	మీనామృతం, సోయాబీన్, పెసలు మొలకల ద్రావణం. సూడోమోనాస్, బవేరియా, మెటారైజియం, వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
40 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
45 రోజులకు	మొలకల ద్రావణం + వేప గింజల కషాయం	మీనామృతం + నేల వేము కషాయం + ఉలవల కషాయం
45 రోజులకు	ఘనజీవామృతం 500 కిలోలు/1 ఎకరం	ఘనజీవామృతం 500 కిలోలు / 1 ఎకరం
65వ రోజు పిచికారి	మొలకల ద్రావణం + ఇంగువ కషాయం + పసుపు దుంపల కషాయం + ఆగ్నేయ అస్త్రం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + వావిలాకు కషాయం
80వ రోజు పిచికారీ	మొలకల ద్రావణం + పుల్ల మజ్జిగ + దశపర్ణి కషాయం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + బవేరియా



జీవామృతం

మోతాదు ఎంత?


- ఎకరం పంటకు సగటున 100–120 లీ. నీటిని పిచికారీ చేయాలి
- మీనామృతాన్ని నారుమడిపై లీ. నీటికి 5 ఎం.ఎల్., పైరు ఎదిగిన దశలో లీ. నీటికి / 10ఎం.ఎల్. చొప్పున కలిపి పిచికారీ చేయాలి
- బవేరియాను లీ. నీటికి /10 గ్రా. కలిపి పిచికారీ చేయాలి
- మెటారైజమ్ లీ. నీటికి/10 గ్రా. వాడాలి
- హ్యూమిక్ యాసిడ్ కిలో విత్తనాలకు/10 గ్రా. వాడాలి.
- కిలో నేల వేము పొడిని 100 లీ. నీటిలో కలిపి కషాయం తయారు చేయాలి
- 1500 గ్రా. వావిలాకు పొడిని కషాయం చేసుకొని 100 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి
- ఎకరానికి రకానికి ఒక కిలో చొప్పున జీవన ఎరువులు వాడాలి
- లీ. నీటికి 10 ఎం.ఎల్. కొబ్బరి నీరు కలపాలి
- పంచగవ్య నారుమడిలో పిచికారీకి లీ. నీటికి 5 ఎం.ఎల్. కలపాలి. పైరు ఎదిగే దశలో పిచికారీకి లీ. నీటికి 20 ఎం.ఎల్. కలపాలి
- అర కేజీ ఇంగువతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి
- 200 గ్రా. పసుపును కషాయం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి
- 2 కిలోల మొలకలతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి
- 6 లీ. పుల్ల మజ్జిగను వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేయాలి.
- ఆగ్నేయ అస్త్రం తయారీలో మిర్చి, అల్లం, వెల్లుల్లిలను అర కిలో చొప్పున తీసుకొని నూరి కషాయం తయారు చేసి వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

(ఇతర వివరాలకు.. సుబ్రహ్మణ్యం రాజు మొబైల్: 76598 55588)

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

సాగుబడి

అశ్లేష కార్తె: ఆగస్టు 17 వరకు
మఖ: 18 నుంచి



థార్ ఎడారిలో సాగవుతున్న మొలకగడ్డి

ఎడారిలో ఆశల మొలక

ప్రపంచంలోనే అత్యధిక పాలను ఉత్పత్తి చేస్తున్న మన దేశంలో పచ్చిగడ్డి లభ్యత 11 శాతం తక్కువగా ఉందని భారతీయ గడ్డి నేలలు, పశుగ్రాస పరిశోధనా సంస్థ లెక్కగట్టింది. భూతాపం ప్రమాదకరమైన రీతిలో పెరుగుతున్న ప్రస్తుత కాలంలో పచ్చిగడ్డి సాగుకు హైడ్రోపోనిక్స్ పద్ధతి చక్కని ప్రత్యామ్నాయంగా మారుతోంది. ఈ పద్ధతిలో తక్కువ స్థలంలో, పది శాతం నీటితోనే ఏడాది పొడవునా మొలక గడ్డిని పెంచుకోవచ్చు. మొలక గడ్డిని పాడి ఆవులు, గొర్రెలు, మేకలకు మేపటం మన రాష్ట్రాల్లోనే కాదు.. రాజస్థాన్‌లోని థార్ ఎడారి ప్రాంత పశుపోషకులను సైతం ఆకర్షిస్తోంది. అక్కడ ఏడాదిలో రెండు నెలలే వర్షం పడుతుంది. మండు వేసవిలో ఎండ వేడి 120 డిగ్రీల సెల్షియస్‌కు చేరుతుంటుంది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో జీవించే థార్ ప్రాంత రైతులు, సంచార పశుపోషకులు స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌ల తోడ్పాటుతో ఇటీవల హైడ్రోపోనిక్ మొలక గడ్డి సాగు చేపట్టారు. సునాయాసంగా నాణ్యమైన పాల దిగుబడితో పాటు ఆదాయాన్ని పెంచుకుంటున్నారు.



మొలకగడ్డి వేస్తున్న మహిళారైతు పలు హేమారామ్

స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌లు ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకుల కోసం హైడ్రోపోనిక్ మొలక గడ్డిని పెంచే షెడ్లను నెలకొల్పుతున్నాయి. రైతులే వాటిలో మొక్కజొన్నలు, గోధుమలను నానబెట్టి, వర్టికల్ గార్డెన్ మాదిరిగా అనేక దొంతర్లలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ట్రేలలో మొలక గడ్డిని పెంచుతున్నారు. సాధారణంగా పొలంలో పచ్చిగడ్డిని పెంచడానికి 2 నెలలు పడుతుంది. మొలక గడ్డి 8 రోజుల్లో పెరుగుతుంది. ముఖ్యంగా పది శాతం నీటితోనే ఈ గడ్డి పెరగటం థార్ ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకులకు ఉపయుక్తంగా మారింది.

స్వచ్ఛంద సంస్థ ఉర్ముల్ సీమంత్ సమితి, డిజర్ట్ రిసోర్స్ సెంటర్‌తో కలసి హైడ్రోగ్రీన్స్, బహుళ నేచురల్స్ స్టార్టప్‌లు మొలక గడ్డి ఉత్పత్తి యూనిట్లను థార్ ఎడారి గ్రామాల్లో ఏర్పాటు చేస్తుండటంతో కొందరు మహిళా రైతులు హాయిగా ఊపిరిపీల్చుకుంటున్నారు. బహుళ నేచురల్స్ వీరి వద్ద నుంచి దేశీ ఆవు పాలను, ఒంటె పాలను సేకరించి, విలువ జోడించి ఆన్‌లైన్‌లో విక్రయిస్తోంది. వెయ్యి మంది పాడి రైతులు, 4 వేల మంది పశుపోషకులు తమ ఆవులు, మేకలకు మొలక గడ్డిని మేపుకుంటూ ఏడాది పొడవునా స్థిరమైన ఆదాయం పొందుతున్నారు.

పశుపోషణ కోసం గొడ్డు చాకిరీ చేసే మహిళా రైతులకు మొలక గడ్డి అందుబాటులోకి రావటం గొప్ప ఊరటనిస్తోంది. మొలక గడ్డి మేపుతో దేశీ ఆవు పాల దిగుబడి మూడింట ఒక వంతు పెరగడంతో పాటు, నాణ్యత కూడా పెరిగిందని రాజస్థాన్‌లోని ఘంటియాలి గ్రామానికి చెందిన దళిత మహిళా పశుపోషకురాలు 'పలు', ఆమె భర్త హేమారామ్ సంతోషంగా చెబుతున్నారు. వీరికి 8 ఆవులు, మేకలు ఉన్నాయి. 4 మైళ్ల దూరంలో ఉన్న పొలానికి వెళ్లి గడ్డి కోసుకొని, ఎండలో నెత్తిన పెట్టుకొని మోసుకు రావటం ఆమెకు కనాకష్టంగా ఉండేది. రెండేళ్ల క్రితం ఇంటి పక్కనే మొలకగడ్డి ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నాక ఆ బాధ తప్పింది. మిగులు గడ్డిని, గోధుమ గడ్డి పొడిని అమ్ముతూ ఆదాయం పొందుతుండటం విశేషం.

దూడలకు పెట్టే కాన్సంట్రేట్ మిక్చర్ దాణాను 75% తగ్గించి మొక్కజొన్న మొలక గడ్డిని మేపటం వల్ల మంచి ఫలితం కనిపించిందని బికనెర్ వెటరినరీ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.కె. ధురియా అన్నారు. హైడ్రోపోనిక్ మొలక గడ్డి వల్ల మేకల్లో జీర్ణశక్తి, పెరుగుదల బాగుందని సౌదీ అరేబియాలోని కింగ్ సౌద్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడైంది. మొలకగడ్డి యూనిట్ ఏర్పాటుకు రూ. 18 లక్షల నుంచి 25 లక్షల వరకు ఖర్చవుతోంది. అయితే, ఇసుక తుపాన్లకు మొలకగడ్డి షెడ్లు దెబ్బతినటం వల్ల నష్టం జరుగుతోంది.

అందుకని, ముందు షిప్పింగ్ కంటెయినర్లలో మొలకగడ్డి ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయటమే దీనికి పరిష్కారమని బహుళ నేచురల్స్ భావిస్తోంది. లక్షల ఖర్చుతో కూడిన పని కావటంతో రైతులను బృందాలుగా ఏర్పాటు చేసి మొలకగడ్డి యూనిట్లను నెలకొల్పితే మేలు. అయితే, రూ. 17.500 ఖర్చుతో చిన్నపాటి మొలకగడ్డి యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చని హైడ్రోగ్రీన్స్ స్టార్టప్ చెబుతోంది.

బయోచార్‌తో సేంద్రియ ఇంటిపంటల సాగుపై శిక్షణ

సేంద్రియ ఇంటిపంటల సాగుపై పట్టణ/నగర వాసులపై ఆసక్తి పెరుగుతోంది. బయోచార్ (బొగ్గుపొడి) కలిపిన మట్టి మిశ్రమంతో టెర్రస్ గార్డెన్లు, పెరటి తోటలు, బాల్కనీలలో కూరగాయల పెంపకంపై ఈ నెల 24, 25 తేదీల్లో హైదరాబాద్ మలకోపేటలోని న్యూలైఫ్ ఫౌండేషన్ శిక్షణ ఇవ్వనుంది. మిగులు పంట దిగుబడులను సోలార్ డ్రయ్యర్‌తో ఎండబెట్టే విధానం కూడా వివరిస్తామని న్యూలైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శివ షిండే తెలిపారు. వివరాలకు.. 81210 08002.

17న అమలాపురంలో ప్రకృతి సేద్యంపై శిక్షణ

శ్రీనివాస సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 17న కోనసీమ జిల్లా అమలాపురంలోని (ముక్తేశ్వరం– కొత్తపేట రోడ్డు) శ్రీసత్యనారాయణ గార్డెన్స్‌లో ప్రకృతి వ్యవసాయంపై నిపుణులు విజయరామ్ రైతులకు అవగాహన కల్పిస్తారని నిర్వాహకులు నిమ్మకాయల సత్యనారాయణ తెలిపారు. ప్రవేశం ఉచితం. ముందుగా పేరు నమోదు చేసుకోవాలి. వివరాలకు.. 64091 11427 (సా. 3 గం. నుంచి 6 గం. వరకు మాత్రమే).